బహిరంగసభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం : సిపిఎం

ప్రజాశక్తి - మడకశిర రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే ప్రజా రక్షణ బేరి బహిరంగ సభ పోస్టర్లను గురువారం మడకశిర పట్టణంలో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బీజేపీని విధానాలను ఎండగడదామన్నారు. రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్బంధ విధానాలపై పోరాటం చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ప్రజావ్యతిరేక రాజకీయ విధానాలు అవలంభిస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలని ప్రజా సమస్యల అజెండాతో సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన విజయవాడలో ప్రజా రక్షణభేరి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగసభలో అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్‌తో పాటు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, కోశాధికారి సాంబశివ, స్థానిక నాయకులు రామాంజనేయులు, నాగరాజు, యోగానంద, మల్లేష్ పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ విజయవాడలో ఈ నెల 15న సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుబ్బిరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ప్రజా రక్షణభేరి పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపి విధానాలను ఎండగడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్బంధ విధానాలకు వ్యతిరేకంగా, రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కదిరి పట్టణ కార్యదర్శి జి.ఎల్. నరసింహులు, నాయకులు బాబ్జాన్, ముస్తాక్, నారాయణ, సుధాకర, రఫీ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలను విజయవంతం చేద్దాం

కలెక్టర్ అరుణ్ బాబు, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో జరిగిన సమీక్ష సమావేశంలో వీరితోపాటు జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్ఒ కొండయ్య, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ట్రస్టు ప్రతినిధులు, చీఫ్ సెక్యూరిటీ అధికారి వాసుదేవన్ ప్రతినిధులు నారాయణ, ప్రభ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ప్రస్తుతం జరుగుతున్న జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు దేశ విదేశాల నుండి భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఎలాంటి లోటు పాట్లు రానివ్వకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వివిఐపిల ప్రోటోకాల్ విధులు, రవాణా, పోలీస్ భద్రత, విద్యుత్, తాగునీటి వసతి కల్పన, అత్యవసర వైద్య సేవలు, పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన బస్సులను కేటాయించాలని ఆర్ ఎం మధుసూదన్‌ను ఆదేశించారు. పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అవసరమైన పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని ఎక్కడ ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. గణేష్ గేట్, గోపురం, వెస్ట్ గేట్, శాంతిభవన్, సాయికుల్మన్ సభ మందిరం, భోజన సముదాయ శిబిరాలు ప్రశాంతి నిలయ పరిసరాల ప్రాంతాల లోపల పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. రవాణా శాఖ ద్వారా ప్రముఖుల కాన్వాయ్ వాహనాల ఏర్పాటు, మొబైల్ టీంలు ఏర్పాటు చేసి ప్రయాణికులు ప్రయాణించే బస్సులు, ఆటోలు ఇతర వాహనాల రద్దీ లేకుండా చూడాలన్నారు. రోడ్లు, డ్రయినేజీ తదితర వాటి మరమ్మతుల పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. పశాంతి నిలయంలో ఎలాంటి మారకద్రవ్యాల వాడకం లేకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పార్కింగ్ స్థలాలకు అనువైన స్థలం కేటాయించాలని, రైల్వే స్టేషన్ నుంచి ప్రశాంతి నిలయం వరకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవల్లో భాగంగా తగిన సిబ్బందితో మందుల పంపిణీ 104, 108 వాహనాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. చిత్రావతి నది తీర ప్రాంతంలో ప్రజల రక్షణ కోసం బారికేట్లను ఏర్పాటు చేయాలని, ముళ్ళకంపలను చెత్తాచెదారం తొలగించి చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో సుందరీకరణతో అహ్లాదకరంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రముఖులకు భోజన వసతి ఏర్పాటుకు సంబంధిత ఆహార తనిఖీ అధికారి ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా భద్రత, రవాణా, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్, ఆర్డీవో భాగ్యరేఖ, డ్వామా పీడీ రామాంజనేయులు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్, డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ రషీద్ ఖాన్, డిపిఒ శివకుమారి, మున్సిపల్ కమిషనర్ కేశన్న, పంచాయతీరాజ్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, విద్యుత్ శాఖ డిఇ మోసెస్, పుట్టపర్తి తహశీల్దార్ నవీన్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

'గార్మెంట్స్' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజు పల్లి రాజమ్ అపెరల్ గార్మెంట్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గార్మెంట్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ పుట్టపర్తి మండలం జగరాజపల్లి వద్ద మంగళకర కాలేజ్ యాజమాన్యం గత మూడు సంవత్సరాల క్రితం నుంచి రాజమ్ ఆఫరల్ గార్మెంట్స్ ఫ్యాక్టరీని నడుపుతోందన్నారు. ఇందులో పుట్టపర్తి, కొత్తచెరువు ,బుక్కపట్నం నుంచి మహిళలు, పురుషులు కలిసి సుమారు 150 మంది కార్మికులు ఇందులో పని చేస్తున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి యాజమాన్యం ఏ పని చెప్పినా కార్మికులు చేశారని అన్నారు. అయితే 2023 సెప్టెంబర్ 9న ఫ్యాక్టరీని పూర్తిగా మూసివేసి 10 రోజులపాటు సెలవులు ఇస్తున్నామని యాజమాన్యం చెప్పడంతో ఇన్ని రోజులు సెలవులు ఎందుకు ఇస్తారని కార్మికులకు అర్థం కాలేదన్నారు. పది రోజుల తర్వాత కొంతమంది కార్మికులు యాజమాన్యం వద్దకు వెళ్లి ఎప్పుడు గార్మెంట్ పరిశ్రమ తెరుస్తారని అడిగితే పూర్తిగా బంద్ చేశామని చావుకబురు చల్లగా చెప్పారన్నారు. అయితే కార్మికులకు రావాల్సిన ఒక నెల వేతనం, బోనస్ ఇవ్వాల్సుందని అంతేకాక మూడు నెలలు ముందే కార్మికులకు సమాచారం ఇవ్వకుండా ఇలా మూసివేయడం సమంజసం కాదని కార్మికులు ప్రశ్నిస్తే యాజమాన్యం సరైన సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. 'ఫ్యాక్టరీ తెరిసేది లేదు, మీకు నెల వేతనం, బోనస్ ఇచ్చేది లేదు, మీకు దిక్కున్న చోట చెప్పుకోండ'ని కార్మికులను బెదిరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎటువంటి సమాచారం నోటీసులు ఇవ్వకుండా మూసివేయడం సరైన పద్ధతి కాదన్నారు. వీటి మీద ఆధారపడి బతుకుతున్న 150 మంది కుటుంబాలను రోడ్డున పడకుండా ఆదుకొని ఈ ఫ్యాక్టరీని తిరిగి ఓపెన్ చేయించి కార్మికులకు రావాల్సిన బకాయిలన్నిటిని వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్, రాజమ్ అపరెల్ కార్మికులు నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, సరోజ్ కుమార్, సునీత, శారద, కళావతి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

మనోళ్లదే.. చూసీ చూడనట్లు పోండి...

యథేచ్ఛగా ఇసుక, మట్టి మాఫియా
శింగనమలలో అడుగడుగునా అక్రమాలు
పట్టుకుంటే రెడ్డిగారి నుంచి ఫోన్
వందకు డయల్ చేసినా ఫలితం శూన్యం

'మనోళ్లదేనబ్బా... చూసీ చూడనట్లు పోవాలి...మీకు మళ్లీ చెప్పాలా... వదిలేయండి.' అంటూ ఇసుక, మట్టి దందాలపై అధికారులకు ముఖ్య నేతల నుంచి ఆదేశాలు వెలుతున్నాయి. దీంతో యధేచ్ఛగా శింగనమల నియోజకవర్గం పరిధిలో ఇసుక, మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. వందకు డయల్ చేసినా వెనక్కు తగ్గకపోవడంతో పోలీసులే మౌనంగా వెనుదిరిగి రావాల్సిన పరిస్థితులు నెలకొనడం గమనార్హం.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల మండలం తరిమెల గ్రామంలో ఒక ప్రజాప్రతినిధి పక్కనేవున్న వంకలో ఇసుకను తవ్వి ట్రాక్టర్‌లో లోడ్ చేసి గ్రామం మధ్యలో ఉంచారు. ఇది చూసి గ్రామస్తుడు వందకు డయల్ చేసి అక్రమంగా తవ్విన ఇసుక ట్రాక్టర్ ఉందని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఆ గ్రామం పరిధిలోని పోలీసులు రాత్రి సమయంలోనే అక్కడికెళ్లారు. ఈ ట్రాక్టర్‌లో అక్రమ ఇసుక ఉందని, దీన్ని స్టేషన్‌కు తీసుకెళ్లాలని చెప్పారు. అయితే సదరు ప్రజాప్రతినిధి ఏ రకంగా తీసుకెళుతావంటూ పోలీసులపైనే ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇది గ్రామంలోని తక్కిన ప్రజానీకం చూస్తుండగానే సాగింది. ఈ వ్యవహారం నడుస్తున్న సమయంలో అదే గ్రామంలో ఉంటున్న మరో ప్రజాప్రతినిధి ఫోన్ చేసి మనదే... చూసిచూడనట్టు పోవాలని పోలీసులకు సూచించారు. 'వందకు డయల్ చేసారు సార్...మాకు ఇబ్బంది అవుతుంది.. ట్రాక్టర్‌ను తీసుకెళుతా'మని పోలీసులు చెప్పినా వినకుండా అడ్డుపడ్డారు. ఇంతలోనే నియోజకవర్గ ముఖ్య నేత కూడా సదరు పోలీసులకు ఫోన్ చేసి...'ఏందబ్బా..మీకు మళ్లీ చెప్పాలా... చూసిచూడనట్టుపోండబ్బా'..అని చెప్పారు. ఆ నేతకు కూడా పోలీసులు ఇదే విధంగా వందకు ఫోన్ చేసారని చెప్పడంతో 'ఏదో ఒకటి చేసి, ట్రాక్టర్ లేదని చెప్పండి' అని చెప్పండని సలహా ఇచ్చారు. ఇదే విషయాన్ని ఆయన సర్కిల్ అధికారికి కూడా చెప్పడంతో ఆ అధికారి లైన్‌లోకి వచ్చారు. ఆ ట్రాక్టరు ఇసుకను ప్రభుత్వ పని కోసం తెచ్చామని ఆసుపత్రి నిర్మాణం వద్ద వదలించి, వందకు ఫోన్ చేసిన సమస్య క్లియర్ అయినట్టు చూపించాలని చెప్పడంతో..అదే పనిని సదరు పోలీసులు చేయాల్సి వచ్చింది. అయితేఈ వ్యవహారమంతా జనం మధ్యలోనే సాగడం గమనార్హం.

యథేచ్ఛగా తవ్వకాలు

ఇది ఒక ఘటన మాత్రమే ఇలా ఈ నియోజకవర్గం పరిధిలో ఏ వంకలో చూసినా పట్టపగలే ఇసుక తవ్వకాలు నడుస్తున్నాయి. అదే విధంగా కొండలను తొలిచేస్తున్నారు...కార్యాలయాల ఎదుటే అంతా జరుగుతున్నా అధికారులు మాత్రం కళ్లకు గంతలకు కట్టుకున్నట్టు మౌనంగా వీక్షించడం తప్ప వాటిని ఆపే చర్యలేవి ఉండకపోవడం గమనార్హం. శింగనమల మండల పరిధిలోని జూలకాలువ, గురుగుంట్ల, తరిమెల, జలాలపురం, రాచేపల్లి పెరవలి ఇలా మొత్తం ఎనిమిది గ్రామాల్లో ఇసుక తవ్వకాలు నడుస్తుండగా, మూడు గ్రామాల్లో మట్టి తవ్వకాలు జెసిబిలతోనే నడుస్తున్నాయి. ఎక్కడైనా పోలీసు సిబ్బంది వీటిని పట్టుకుంటే వెంటనే రెడ్డిగారి నుంచి ఫోన్ వస్తుంది. వదలి పెట్టమని హుకుం జారీ అవుతుంది. వీటిని అధికారులు శిరసావహించడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితుల్లోనున్నారు. ఏమైనా అంటే నేరుగా ముఖ్యమంత్రి స్థాయిలో ఆ నియోజకవర్గం నేతకు పలుకుబడి ఉందన్న ప్రచారం నడుస్తుండటంతో అధికారులు మౌనం వహించడం తప్ప ఏమీ చేయలేని నిస్సాహాయ స్థితిలో ఉంటున్నారు. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా నిత్యం వందల ట్రాక్టర్ల ఇసుక అక్రమ తవ్వకాలు యధేచ్ఛగా సాగుతున్నాయి.

జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం

కాంగ్రెస్‌పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి

విలేకరుల సమావేశంలో పాల్గొన్న తులసిరెడ్డి, తదితరులు

ప్రజాశక్తి ముదిగుబ్బ

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రం ఒక్క శాతం కూడా అభివృద్ధికి నోచుకోలేదని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ఏపీ మీడియా చైర్మెన్ తులసిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం ముదిగుబ్బకు రావటంతో ఆపార్టీ స్థానిక నాయకులు తులసిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్, పిసిసి డెలిగేట్ నిస్సార్ అహ్మద్ తదితరులు తులసి రెడ్డిని కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తులసిరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ ప్రారంభం నుంచి పరిపాలన గాలికొదిలేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు నిజం తెలుసుకోవాలన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని కూలదోసి సుభిక్షమైన పరిపాలన అందించే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తాడిమర్రి మండల కన్వీనర్ కాటమయ్యతో పాటు స్థానిక నాయకులు మల్లాగుండ్ల ఆదినారాయణ ,నాగరాజు, రెడ్డప్ప పాల్గొన్నారు.

గుడిసెలు వేసుకున్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న నాయకులు, పేదలు

50వ రోజుకు ఇళ్ల స్థలాల పోరాటం

ప్రజాశక్తి - చిలమత్తూరు

సర్వేనెంబర్ 805 లో అర్హులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరుతూ పేదలు చేస్తున్న ఆందోళన గురువారానికి 50వ రోజుకు చేరుకుంది. పేదలు 805 సర్వేనెంబర్ జగనన్న కాలనీలో వేసుకున్న గుడిసెలను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నల్లా లక్ష్మినారాయణ ఈ సందర్భంగా పరిశీలించారు. పేదల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అర్హులుగా గుర్తించి పట్టాలు ఇచ్చినట్లే ఇచ్చి లాగేసుకోవడం దారుణమన్నారు. ఇపుడు ప్రభుత్వం గుర్తించిన జగనన్న లేఅవుట్ లో గుడిసెలు వేసుకున్నా పట్టాలు ఇవ్వడానికి మీన మేషాలు లెక్కపెట్టడం సమంజసం కాదన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు చందు, సదాశివరెడ్డి, రహమతుల్లా, శివ, వేణు, రియాజ్, అబ్బాస్, అలివేలమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నదుల అనుసంధానానికి సైకిల్ యాత్ర

తమిళనాడు వ్యక్తి 'అనంత' మీదుగా పయనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలో నదుల అనుసంధానాన్ని కాంక్షిస్తూ తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ ఏడాది జూన్ ఒకటవ తేదీన ఆయన ప్రారంభించిన సైకిల్ యాత్ర గురువారం అనంతపురం నగరానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో ఆయన జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద వెళుతుండగా ఆయనను 'ప్రజాశక్తి' పలుకరించింది. ఈ సందర్భంగా ఆయన తన సైకిల్ యాత్ర వివరాలను వెల్లడించాడు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లి జిల్లాకు చెందిన అమ్మయ్యరుకుప్పం గ్రామానికి చెందిన హోటల్ నిర్వాహకుడు ఎస్.సంజీవి దేశంలో నదుల అనుసంధానం చేయాలని ఈ యాత్రను చేపట్టాడు. జూన్ ఒటవ తేదీన తమిళనాడులోని తిరుత్తినిలో ఈ యాత్ర ప్రారంభించి కర్నాటక, గోవా, మహారాష్ట్ర మీదుగా గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ మీదుగా కోల్‌కతా, భువనేశ్వర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించినట్లు సంజీవి ఈసందర్భంగా తెలిపారు. తిరిగి కర్నాటక మీదుగా చెన్నైలో ఈ యాత్రను ముగించనున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటి వరకు 7750 కిలోమీటర్లు ఒంటరిగా ఈ యాత్రను చేపట్టినట్టు వివరించాడు. దేశానికి వెన్నముక రైతు అని ఆ రైతుకు సాగునీటిని అందించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నాడు. అనేక రాష్ట్రాల మధ్య సాగునీటి సమస్యలు అనేకమున్నాయన్నాడు. వీటన్నింటికీ పరిష్కారం జరగాలంటే దేశంలో నదుల అనుసంధానం చేయడమే మార్గమని తాను భావిస్తున్నట్టు చెప్పాడు. అందుకే నదుల అనుసంధానం ప్రాధాన్యతను వివరిస్తూ ఈ యాత్రను చేపట్టినట్టు సంజీవి తెలిపాడు. గతంలో కూడా రెండు పర్యాయాలు ఇదే రకంగా యాత్రను చేపట్టానన్నారు. ఈ యాత్ర ముగిసిన తరువాత కర్నాటక ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కలసి నదుల అనుసంధానం గురించి తన అనుభవాలను వివరిస్తానని సంజీవి చెప్పాడు.

సైకిల్‌యాత్రలో ఎస్. సంజీవి

గడువులోగా ప్రాధాన్యత పనులు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రాధాన్యత పనులను గురువారం సమీక్షించారు. ముఖ్యంగా రెవిన్యూ, రీ సర్వే, ఎంపిఎస్పీ గోడౌన్లకు భూ కేటాయింపు, వ్యవసాయం, పశు సంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్, ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణాలు, పంచాయతీరాజ్ శాఖ ఆధర్వంలో చేపట్టిన ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ, స్వమిత్ర తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యత భవనాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామన్నారు. గృహ నిర్మాణం డిసెంబర్ లోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు అవసరమైన పనులు కేటాయిస్తామన్నారు. ఇప్పటికే పూర్తయిన సచివాలయాల భవన నిర్మాణాలు, హెల్త్ క్లినిక్లు, రైతు భరోసా భవనాలు ఆయా శాఖలకు అప్పగించాలని అధికారులను ఆదేశించామని వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్ఒ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

విడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

రాగుల సేకరణపై సమావేశం

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ డివిజన్‌లో రైతుల నుంచి రాగులు సేకరణపై గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కె.కార్తీక్ అధ్యక్షతన సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతు భరోసా కేంద్రాల్లో రాగుల సేకరణపై రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణపై చర్చించారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్, పెనుకొండ, మడకశిర వ్యవసాయ శాఖ ఎడిలు, సిఎస్‌డిటిలు, పిఎసిఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పట్టణంలోని ఆటో కార్మికులకు మాజీ మంత్రి పల్లెరఘునాథ్‌రెడ్డి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. దీపావళి పండుగను పురస్కరించుకుని కరణం సుబ్రహ్మణ్యస్వామి సహకారంతో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆటో కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను కరణం సుబ్రహ్మణ్యం తన సొంత నిధులతో పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కరణం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దీపావళి పండుగతో పాటు సత్యసాయి జయంతి వేడుకలు కూడా ఈ నెలలోనే నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా తన వంతుగా ఆటో కార్మికులకు నూతన వస్త్రాలు పల్లె ఆధర్వంలో పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు.

కార్మికులకు వస్త్రాలు అందజేస్తున్న పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

సోమందేపల్లి : భార్య కాపురానికి రాలేదని జీవితంపై విరక్తి చెంది స్థానిక సప్తగిరి కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాస్ గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. చిలమత్తూరు మండలంలోని నల్లరాళ్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఇక్కడ మగ్గం నేస్తూ జీవనం సాగించేవాడు. ఇతడికి భార్య లలిత, కుమార్తె మదులశ్రీ ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పిడుగు పడి గొర్రెలకాపరి మృతి

కొత్తచెరువు రూరల్ : మండల పరిధిలోని పాత దేవరపల్లి గ్రామానికి చెందిన గొర్రెలకాపరి గంగాధర్(26) బుధవారం రాత్రి పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. గంగాధర్ ఇంటి నుంచి గొర్రెల మంద వద్దకు వెళ్తుండగా వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగుపాటుకు గురై అపస్మారకస్థితికి చేరుకోగా కుటుంబ సభ్యులు సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అతడి భార్య 9 నెలల గర్భిణి. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి గురువారం ఆ గ్రామం వెళ్లి గంగాధర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పల్లెతో పాటు టిడిపి పట్టణ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ ఉన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడి

గాండ్లపెంట : మండల పరిధిలోని తుమ్మలబైలు పెద్దతండాలో ఏర్పాటుచేసిన నాటుసారా స్థావరాలపై గురువారం దాడి చేసినట్లు ఎస్ఐ ఎ.వెంకటనారాయణ తెలిపారు. గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో సిబ్బందితో వెళ్లి తుమ్మల బైలు పెద్దతండా గ్రామ సమీపంలో నాటుసారా స్థావరంపై దాడి చేసి 60 లీటర్ల ఊటను ధ్వంసం చేసి 6 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన గోపాల్‌నాయక్, నర్సినాయక్ పరారయ్యారని తెలిపారు. దాడుల్లో జమేదార్ రామయ్య, పోలీసులు శ్రీనివాసులు, నరసింహ, గురుప్రసాద్‌రెడ్డి, బాషా, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్టు

హిందూపురం : పట్టణంలోని హస్నాబాద్ ముస్లిం శ్మశాన వాటిక మసీదులో గత శనివారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి మౌలానా వలివుల్లాతో పాటు మరో ఇద్దరు నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. ఇటీవల వేరే ప్రాంతానికి చెందిన జమాత్ సభ్యులు ఈ మసీదులో ప్రార్థనలు చేస్తుండగా మౌలానా వలివుల్లా, అతడి శిష్యులు సాద్(గోరంట్ల), సిద్ధిక్(కదిరి) అభ్యంతరం చెప్పడంతో వారు వెళ్లిపోయారు. ఈ విషయంపై స్థానిక ముస్లింలు ఆ ముగ్గురిని ప్రశ్నించగా వారు దాడి చేయడంతో హారూన్‌రషీద్ గాయపడ్డాడు. అతడి ఫిర్యాదు మేరకు సాద్, సిద్ధిక్‌లతో పాటు మౌలానా వలివుల్లాను పోలీసులు అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న వలివుల్లా శిష్యులు పెద్ద ఎత్తున వన్‌టౌన్ స్టేషన్ వద్ద గుమిగూడారు. దీంతో పోలీసులు వైద్యులను స్టేషన్‌కు పిలిపించి వైద్య పరీక్షల అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచారు.

ఇద్దరు నిందితులకు జైలు, జరిమానా

కదిరి అర్బన్ : అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి మీనాక్షి సుందరి గురువారం ఇద్దరు ముద్దాయిలకు శిక్ష విధించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో నలుగురు వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. వారిలో గంగరాజు, రమణలకు ఏడాది జైలు, రూ. 500 జరిమానా విధించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. మరొక కేసులో 3 నెలల జైలు, రూ. 500 జరిమానా విధించారు. ఫిర్యాదుదారుల తరపున ఎపిపి సాయికృష్ణ వాదించారు. మిగిలిన ఇద్దరు ముద్దాయిలు చిన్నమ్మ, చిన్న గంగన్న కేసును కొట్టి వేసినట్లు ఆయన తెలిపారు.

కొనసాగుతున్న సెబ్ దాడులు

పుట్టపర్తి రూరల్ : ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో సెబ్ అధికారులు దాడులను కొనసాగిస్తున్నారు. గురువారం మడకశిర స్టేషన్ పరిధిలోని ముత్తేపల్లి గ్రామంలో ఒకరిని అరెస్టు చేసి కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ అధికారులు పెనుకొండ స్టేషన్ పరిధిలో ఇద్దరిని అరెస్టు చేసి కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. కదిరి స్టేషన్ పరిధిలో కర్నాటక మద్యం, పెనుకొండ స్టేషన్ పరిధిలో కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు తరలించారు.

నిషేధిత సిగరెట్లు స్వాధీనం

చిలమత్తూరు : కొడికొండ చెక్‌పోస్టులో గురువారం విజిలెన్స్ అధికారులు దాడులు చేసి రూ. 3,75,000 విలువ చేసే నిషేధిత సిగరెట్లను సీజ్ చేశారు. విజిలెన్స్ సిఐ రామారావు మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు కొడికొండ చెక్‌పోస్టులోని ఓ షాపును తనిఖీ చేసి ఓ గోడౌన్‌లో నిల్వ ఉంచిన నిషేధిత సిగరెట్లు పట్టుబడ్డాయన్నారు. వాటిని సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించి నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ జైపాల్ రెడ్డి, డిసిటిఒ విజయలక్ష్మి, ఎస్ఐ వి.గంగాధర్ పాల్గొన్నారు.

నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

డాక్టర్ కల్పన బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-నల్లచెరువు

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం డాక్టర్ కల్పన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మండల పరిధిలోని ఓరువాయి గ్రామంలో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సేవలు, పథకాలు, ఆరోగ్యశ్రీపై ప్రజల్లో అవగాహనపై సర్వే నిర్వహించారు. సెంట్రల్ టీంను జిల్లా మానిటరింగ్ టీం సభ్యులు డాక్టర్ చెన్నారెడ్డి, డిపిహెచ్ఎం వీరమ్మ మానిటరింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఐనొద్దిన్, సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, తస్లీంబాను, ఎఎన్ఎం రోజా, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణరెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్-17 క్రికెట్ పోటీలకు బ్లూమూన్ విద్యార్థిని

ప్రజాశక్తి-కదిరి టౌన్

అనంతపురం నగరంలోని ఆర్‌డిటి స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అండర్-17 బాలల క్రికెట్ పోటీల్లో బ్లూమూన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు విద్యా సంస్థల ఛైర్మన్ శివశంకర్ గురువారం తెలిపారు. రూరల్ మండల పరిధిలోని ఎర్రదొడ్డి గంగమ్మ వద్ద ఉన్న పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దీపు ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. దీపు డిసెంబర్‌లో మచిలీపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. దీపుని ఛైర్మన్‌తో పాటు హెచ్ఎం సురేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు రామాంజనేయరెడ్డి తదితరులు అభినందించారు.

జిల్లా సమాఖ్య నూతన పాలకవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

జిల్లా సమాఖ్య నూతన పాలకవర్గం ఎన్నికైనట్టు డిపిఎంఎల్ హెచ్ రామ్మోహన్ తెలిపారు. స్థానిక డిఆర్‌డిఎ కార్యాలయంలో గురువారం అసిస్టెంట్ సహకార అధికారి రమణారెడ్డి, అనంతపురం జిల్లా సమాఖ్య కార్యవర్గ సభ్యురాలు నీలమ్మ పర్యవేక్షణలో జిల్లా సమాఖ్య నూతన నూతన పాలకవర్గం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షురాలిగా సిద్ధగంగమ్మ(హిందూపురం), ఉపాధ్యక్షురాలిగా పుష్పలత(పుట్టపర్తి), కార్యదర్శిగా అనూష (అమడగూరు), ఉప కార్యదర్శిగా సుధారాణి(కదిరి), కోశాధికారిగా రోజా(ధర్మవరం) ఎన్నికయ్యారు. కొత్తగా పాలకవర్గం సభ్యులకు డిఆర్‌డిఎ పిడి నర్సయ్య, డిపిఎం ఐబి నాగరాజు, డిపిఎంఎల్ హెచ్ రామ్మోహన్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇనాయతుల్లాకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నో ఏళ్లుగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు అండగా ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇనాయతుల్లాను గురువారం ఎస్‌టియు నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వారి సమస్యలను ఆయనకు వివరించారు. స్పందించిన ఇనాయతుల్లా వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాసులు, తిప్పన్న, ఉదయ్‌కుమార్, కరియప్ప, జయకృష్ణ, నారాయణప్ప, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

ప్రజాశక్తి-హిందూపురం

లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం జాతీయ న్యాయ విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ప్రజలు చిన్నపాటి వివాదాలు, తగాదాలకు కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగి డబ్బు, సమయం వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో ఎలాంటి రుసుము చెల్లించకుండా ఉచితంగా వెంటనే న్యాయం పొందవచ్చు అన్నారు. సమావేశంలో ఎపిపి సుహాసిని, ఎజిపి శ్రీనివాస్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, న్యాయవాదులు నాగేశ్వరరావు, గుండాచారి, కళావతి, రామిరెడ్డి, సిద్ధా, కృష్ణమూర్తి, రకీబ్, లోక్ అదాలత్ శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో గురువారం జాతీయ లోక్ అదాలత్ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి శంకర్రావు, జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ ఫసల సయ్యద్, ఎజిపి భాస్కం రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ కక్షిదారులు రాజీ మార్గంలో వెళ్తే డబ్బులు, సమయం వథా కాకుండా ఉచిత ఫీజులతో పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. పేదవారికి ఉచితంగా న్యాయ సహాయం అందించడమే లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశం అన్నారు. కోర్టు ఆవరణలో డిసెంబర్ 9వ తేదీ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : న్యాయ సేవలు, చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రాజ్యలక్ష్మి

జాతీయ న్యాయ సేవా దినోత్సవం పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ఎన్జీవో హోంలో జన జాగృతి సంస్థ ఆధ్వర్యంలో విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి హాజరై మాట్లాడారు. మానవ అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ చదువుకొని విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఉచిత న్యాయ సేవలు, లోక్ అదాలత్ గురించి వివరించారు. సదస్సులో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేశ్వర్ రెడ్డి, న్యాయవాదులు దశరథనాయక్, సిరాజుద్దీన్. కదిరి టౌన్ సిఐ నారాయణరెడ్డి, సూపర్‌వైజర్ నిహారిక, జన జాగృతి సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వాలను నిలదీద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీద్దామని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణంలో 'చలో విజయవాడ' పోస్టర్లను విడుదల చేశారు. నరసింహప్ప మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు కలవరపరుస్తున్నాయ న్నారు. బిజెపి పాలనలో దేశం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో నవంబర్ 15న విజయవాడలో నిర్వహించే బహిరంగసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అత్తర్‌బాబా, చంద్ర, కల్లూరు ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

సోమందేపల్లి : విభజన హామీలు, ప్రత్యేక హోదా, అసమానతలు లేని అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోరుతూ ఈ నెల 15వ తేదీ చేపట్టనున్న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దన్న పిలుపునిచ్చారు. సోమందేపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు టిడిపి, జనసేన పార్టీల మోసపూరిత వైఖరులను ఎండగట్టాలన్నారు. సిపిఎం మండల కార్యదర్శి రంగప్ప అధ్యక్షతన 'చలో విజయవాడ' పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమం లో కెవిపిఎస్ వెంకటేశులు, కొండా వెంకటేశులు, గంగరాజు, రవి, ఈడిగ నాగరాజు, శీలా నారాయణస్వామి, నాగభూషణ, బెస్త క్రిష్ణప్ప, కుమ్మర కిష్టప్ప, పటాకుల శీన, గోవిందప్ప, నజీర్, అలివేలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న తిప్పేస్వామి

వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-మడకశిర

మండల పరిధిలోని హరేసముద్రం గ్రామంలో గురువారం నిర్వహించిన వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టా పన కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి పాల్గొన్నారు. ముందుగా వారు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సంఘం అధ్యక్షుడు అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ ఉమాశంకర్, మల్లికార్జున, కృష్ణమూర్తి, రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే హామీలన్నీ నెరవేరుస్తాం

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

టిడిపి అధికారంలోకి వస్తే ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తామని మాజీ మంత్రి పరిటాల సునీత స్పష్టం చేశారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా గురువారం ఆమె స్థానిక బిసి కాలనీలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలు ఏమాత్రం పట్టించుకోని వైసిపి ప్రభుత్వాన్ని శాశ్వతంగా ఇంటికి పంపుదామని ప్రజలకు పిలుపునిచ్చారు. వైసిపి హయాంలో బిసిలపై దాడులు ఎక్కువయ్యాయని, దీంతో వారి రక్షణ కోసం చట్టాన్ని తీసుకొస్తామన్నారు. ప్రజలు ఆలోచించి టిడిపిని ఆదరించాలని కోరారు. అనంతరం ఆమె మండల పరిధిలోని దామాజిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న పరిటాల సునీత

చంద్రబాబుతోనే రాష్ట్రాభివద్ధి : పల్లె

కొత్తచెరువు : టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా పల్లె స్థానిక నాయకులతో కలిసి స్థానిక ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాగేంద్రప్రసాద్, గాజుల చంద్రమోహన్, బోయ రాజు, పెద్దన్న, శివకృష్ణ, సయ్యద్‌బాషా, చంద్ర, నాగేంద్ర, ఎల్లమ్మ, నాగమణి, రాధా పాల్గొన్నారు

ముదిగుబ్బ : మండల పరిధిలోని ఎస్.బ్రాహ్మణపల్లి గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల మనోహర్, చంద్రశేఖర్, జయప్రకాష్, మనోహర్, నరేంద్ర, సుధాకర్, వెంకటనాయుడు, నారాయణస్వామినాయుడు, అశోక్ పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా అర్హులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తారని పేదలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఫైర్ అధికారి నాగరాజునాయక్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలానికి 150 కనెక్షన్లు మంజూరయ్యాయన్నారు. అనంతరం వాటిని అర్హులకు పంపిణీ చేశారు. గ్యాస్ వాడకంపై ఫైర్ సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించారు. సమావేశంలో తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, సిఎస్‌డిటి రమేష్, ఎస్ఐ సురేష్‌బాబు, ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పివి.సూర్యనారాయణ, పివి. రాజీవ్‌దేవ్, వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

19న గుడికట్ల సంబరాలు

గోరంట్ల రూరల్ : ఈ నెల 19వ తేదీ అనంతపురం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న గుడికట్ల సంబరాలను విజయవంతం చేయాలని కురుబ సంఘం నాయకులు బోరంపల్లి ఆంజనేయులు, నెమలివరం ఈశ్వరయ్య, కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. పట్టణంలో గురువారం వారు ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు.

చైతన్య పాఠశాలలో డివైఇఒ విచారణ

హిందూపురం : పట్టణంలోని చైతన్య పాఠశాలలో ఇటీవల తరగతి గది పైకప్పు పెచ్చులూడి విద్యార్థులపై పడిన సంఘటనపై గురువారం పెనుకొండ జిల్లా ఉప విద్యాశాఖ అధికారి రంగస్వామి స్థానిక ఎంఇఒ గంగప్పతో కలిసి చైతన్య పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. పెచ్చులూడిన గదిని పరిశీలించి గాయపడ్డ విద్యార్థులను విచారణ చేసి, లిఖిత పూర్వకంగా వారితో లేఖలు తీసుకున్నారు. అనంతరం డివైఇఒ రంగస్వామి మాట్లాడుతూ విచారణ నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేస్తామన్నారు.

విద్యార్థినులను విచారిస్తున్న డివైఇఒ రంగస్వామి

సచివాలయంలో వైసిపి జెండా ఎగరేయడం తగదు : టిడిపి

ప్రజాశక్తి-సోమందేపల్లి

జాతీయ జెండాకు, పార్టీ జెండాకు తేడా తెలియని అజ్ఞాని ఎమ్మెల్యే శంకర నారాయణ అని టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారథి ఎద్దేవా చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ గోరంట్లలో జరిగిన వైసిపి కార్యక్రమంలో ఓ సచివాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే స్తంభంపై వైసిపి జెండాను ఎగరేసి జాతీయ జెండాను అవమానపరిచారని మండిపడ్డారు. జాతీయ జెండా నియమాలు తెలియని ఇలాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను పార్టీ కార్యాలయాలుగా, ప్రభుత్వ అధికారులను కార్యకర్తలుగా మార్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. శంకరనారాయణను చట్టం ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్ధలింగప్ప, వడ్డీ లక్ష్మణ్, శరత్‌చంద్ర, నాయకులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మల కిష్టప్ప

ఉనికి కోసమే చంద్రబాబుపై విమర్శలు : సవితమ్మ

పెనుకొండ : టిడిపి అధినేత చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యే శంకరనారాయణకు లేదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. ఆమె గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎమ్మెల్యేని నియోజకవర్గ ప్రజలు చీదరించుకొంటున్నారని, వైసిపి నాయకులు సైతం దూరం పెట్టడంతో కేవలం ఉనికి కోసం చంద్రబాబును విమర్శిస్తున్నాడని మండిపడ్డారు. ఇంకోసారి చంద్రబాబు గురించి మాట్లాడితే ప్రజలే తిరగబడి ధర్మవరం వరకూ తరిమి తరిమి కొడతారని హెచ్చరించారు. ఎమ్మెల్యే గోరంట్ల సచివాలయంలో వైసిపి జెండా ఎగరవేయడాన్ని తప్పుపట్టారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, చంద్రమౌళి, శ్రీరాములు, డివి ఆంజనేయులు, ఆంజనేయులు, సూర్యనారాయణ, నీరుగంటి చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, త్రివేంద్ర, బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం : మాజీ ఎంపీ నిమ్మల

గోరంట్ల : పట్టణంలోని 1వ సచివాలయంలో ఎమ్మెల్యే శంకరనారాయణ వైసిపి జెండాను ఎగరవేయడాన్ని మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప తప్పుపట్టారు. ఆయన గురువారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రభుత్వ కార్యాలయంలో వైసిపి జెండా ఎగరవేయడం సమంజసం కాదని, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, నారాయణస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన జగన్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నిరుద్యోగులను సిఎం జగన్ మోసం చేశారని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి చిన్నూరు విజయ్ చౌదరి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తెలుగ యువత, టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో నాయకులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులే వైసిపికి తగిన బుద్ధి చెబుతా రన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇర్షాద్, తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలేశ్, నియోజకవర్గ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మధుసూదన్, సంగాల బాలు, కార్యదర్శి యుగంధర్, పట్టణ ఉపాధ్యక్షుడు హరి, కాటమయ్య, పవన్, టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు అశోక్, దుర్గానగర్ ఆది, అడ్రా మహేశ్, బిల్లే రామక్రిష్ణ, రమేష్ పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

పుట్టపర్తి క్రైమ్ : ప్రభుత్వం నోటిఫికేషన్ పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తుందని తెలుగు యువత నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి గణేష్ కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువతను నట్టేట ముంచిన ఘనుడు సిఎం జగన్ అన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షుడు ఓబుళరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాల మనోహర్, అమడుగూరు మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు సుధీర్, కార్యదర్శులు బడా మధుసూదన్‌రెడ్డి, టైలర్ రామంజి, గిరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సమర్థవంతంగా పని చేసి ప్రజల్లో పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ మాధవ్‌రెడ్డి సూచించారు. పుట్టపర్తి రూరల్, ధర్మవరం రూరల్ ఎస్ఐలుగా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్, కృష్ణమూర్తి గురువారం ఎస్పీ ఛాంబర్లో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ వారికి సూచించారు.

ఘనంగా ఉర్దూ భాషా దినోత్సవం

హిందూపురం : పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి అధ్యక్షతన ఉర్దూ భాష అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఉర్దూ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉర్దూ భాష పరిణామం, ఉర్దూ భాషాభివృద్ధికి మహమ్మద్ ఇక్బాల్ చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు హెచ్.మహమ్మద్ రఫీక్, సిద్ధిక్ సైఫ్, ఆరీఫ్‌ఆమిని, నూర్ షరీఫ్, చరిత్ర అధ్యాపకులు అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్, ఉర్దూ ఉపన్యాసకులు ఖుష్నుమాబేగం, కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ అఫ్సానా, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆలయానికి మైక్‌సెట్ వితరణ

పుట్టపర్తి క్రైమ్ : బుక్కపట్నం మండల పరిధిలోని లింగప్పగారిపల్లిలో వెలసిన రామాలయానికి గురువారం టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మైక్ సెట్‌ని అందజేశారు. ఆయన గురువారం పట్టణంలోని తన నివాసంలో ఆ గ్రామస్తులకు మైక్ సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటపతి, తిరుపాల్, వెంకటేష్, అశ్వర్థ నారాయణ, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

మైక్ సెట్, స్పీకర్లు పంపిణీ చేస్తున్న సామకోటి ఆది

ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో అసాంఘిక కార్యక్రమాలు

రొద్దం : స్థానిక ఎంపిడిఒ, తహశీల్దార్, వెలుగు కార్యాలయాల ప్రాంగణాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. ప్రతిరోజూ రాత్రివేళ ఆకతాయిలు మద్యం తాగి సీసాలు, నీళ్ల ప్యాకెట్లను అక్కడే పడేస్తున్నారు. దీంతో ఆయా కార్యాలయాల ప్రాంగణాల్లో ఎటు చూసినా మద్యం, బీరు సీసాలు, నీళ్ల ప్యాకెట్లు, సిగరెట్ పీకలు దర్శనమిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.



రొద్దం ప్రభుత్వ కార్యాలయంలో మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి , కదిరి
O.S.NO:818/2022
Between:
బి.జగన్ మోహన్ రెడ్డి తండ్రి బి.ఆనంద్ రెడ్డి, వయస్సు 32 సం।।లు, హిందూ, వ్యవసాయం మరియు వ్యాపారం, R/o D.No:14-460-C, మూర్తిపల్లి, కదిరి టౌన్ మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా ...వాది
మరియు
కాసాబత్తిన శ్రీనివాసులు తండ్రి లేట్ కె.గంగయ్య, వయస్సు 41 సం।।లు, హిందూ, వ్యాపారం, R/o D.No:3-27-A-4-1, కోనేరు స్ట్రీట్, కదిరి (టౌన్ మరియు మండలం) శ్రీ సత్యసాయి జిల్లా ...ప్రతివాది
కోర్టు వారి ఉత్తర్వు మేరకు
పైన తెలిపిన వాది అయిన బి.జగన్ మోహన్ రెడ్డి అను అతను, ప్రతివాది అయిన కాసాబత్తిన శ్రీనివాసులు అనే నీపై ప్రాంసరి నోటు బాకీ వసూలు నిమిత్తం పైన తెల్పిన దావాను పైన తెల్పిన కోర్టులో వేసి ఉన్నారు.పై దావాలో నీ యొక్క హాజరు నిమిత్తము కోర్టు వారు 17/11/2023వ తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున ప్రతివాది అయిన నీవు పై తెల్పిన వాయిదా తేది ఉదయం 10:30 గం।।లకు కోర్టు వారి ఎదుట నీవు కానీ, నీ యొక్క వకీలు ద్వారా గానీ ఖుద్దున హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయగలరు. అట్లు హాజరు కాని పక్షంలో దావాను నీ పరోక్షముగా తీర్మానించబడునని నీకు తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:17/11/2023
స్థలం: కదిరి ఇట్లు
ఎ.క్రిష్ణమూర్తి, యమ్.ఎ., ఎల్.ఎల్.బి.
వాదిపరం న్యాయవాది, కదిరి
సెల్:9440310692

In the court of the Senior Civil Judge:Dharmavaram
O.S.No:76/2015
Between:
S.Pullamma & Others ...Plaintiffs
And
S.Bharathi Builders Rep by Mgp.
K.Pichi Reddy & Others ...Defendants
Summon
To:
D23:Jayasudha D/o B.Subbi Reddy, Agriculturist, Pathapalyam Village, Kanaganipalli Mandal,
D25: R.Lakshmidevi W/o Sreerami Reddy, D/o B.Chinna Subbi Reddy, Agriculturist, Guntapalli Village, Kanaganipalli Mandal,
D31:L.Lakshmidevi W/o Ramakrishna, Aged 52 Years, Hindu, Agriculturist, Nadimigaddapalli, Dharmavaram Mandal,
D33:B.Naramma W/o Narayana Reddy, Aged About 65 Years, Agriculturist, Mucchurami Village, Kanaganipalli Mandal,
ప్రతివాదులు నెం: D23,D25, D31,D33 అయిన మీ పైన పై తెలిపిన వాదులు పై కోర్టు నందు దావా వేసినారు. పై కోర్టు వారు పై దావాను 16/11/2023వ తేదికి వాయిదా వేసినారు. కావున పై తేదిన మీరు ప్రత్యక్షముగా కానీ వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గం।।లకు పై కోర్టు నందు హాజరు కావలెను.లేని యెడల పై కోర్టు వారు మీ పరోక్షముగా పై దావాను తీర్మానించెదరని తెలియజేయడమైనది.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
D.VIJAYARAGHAVENDRA,
B.A.,L.L.B,
ADVOCATE, DHARMAVARAM.

In the court of the Senior Civil Judge:Dharmavaram
I.P.No:2/2023
Between:
D.Adi Narayana ...Petitioner
And
K.Ramalakshmamma & 2 Others ...Respondents
Notice To Respondent
To:
R1:Koppala Ramalakshmamma W/o K.C.Venkatesu, Aged About 67 Years, Hindu, Bussiness,
R2:Koppala Sudhakar S/o K.C.Venkatesu, Aged About 44 Years, Hindu, Bussiness, R1 And R2 Are Residing of D.No:7/104, Madhava Nagar, Dharmavaram.
రెస్పాండెంట్స్ నెం: R1,R2 అయిన మీ పైన పై తెలిపిన పిటీషనర్ పై కోర్టు నందు పిటీషన్ వేసినారు. పై కోర్టు వారు పై పిటీషన్ 20/11/2023వ తేదికి వాయిదా వేసినారు. కావున పై తేదిన మీరు ప్రత్యక్షముగా కానీ వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గం।।లకు పై కోర్టు నందు హాజరు కావలెను.లేని యెడల పై కోర్టు వారు మీ పరోక్షముగా పై పిటీషన్ తీర్మానించెదరని తెలియజేయడమైనది.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
D.VIJAYARAGHAVENDRA,
B.A.,L.L.B,
ADVOCATE, DHARMAVARAM.

బహిరంగ ప్రకటన
Between:
1.పల్లెం గణేష్ S/o పి.రామక్రిష్ణ
2.పల్లెం స్వప్న D/o పి.రామక్రిష్ణ
3.పల్లెం ముకేష్ S/o పి.రామక్రిష్ణ ...వాదులు
V/S
1.పల్లెం రామక్రిష్ణ S/o వెంకటస్వామి
2.పల్లెం దినేష్ S/o పి.రామక్రిష్ణ
3.పల్లెం క్రిష్ణవేణి W/o రామక్రిష్ణ ...ప్రతివాదులు
ఇందుమలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా పైన తెలిపిన వాది, ప్రతివాదులకు సంబంధించిన క్రింది షెడ్యూలు దాఖల ఆస్తి ఉమ్మడి కుటుంబ జాయింటు హక్కు అనుభవము ఉన్నది. ప్రతివాదులు షెడ్యూలు ఆస్తికి సంబంధించి వాదులకు తెలియకుండ మోసపూరితంగా క్రయ, విక్రయములు చేయుటకు మరియు ఫైనాన్సియల్ సంస్థల ముందు తనకా పెట్టుటకు ప్రయత్నించుచున్నారు. అలాంటి లావాదేవిలు క్రయ, విక్రయాలు చెల్లవని యావన్మందికి తెలియజేయవచ్చును.
షెడ్యూలు
కదిరి మున్సిపాలిటీకి చేరిన సోమగుట్ట వీధి నందు గల 106-66 చదరపు గజములు జాగా పురమున ఈ జాగాలో నిర్మించిన డోర్.నెం:3/285/7బి
చెక్కుబంది:-
తూర్పు: ఆదినారాయణ ఇల్లు, పడమర:బాలాజి గుప్త ఇల్లు, ఉత్తరం:రాస్తా, దక్షిణం: స్కావెంజరువైను ఈ మధ్య తూర్పు-పడమర 16-0 అడుగులు, ఉత్తరం-దక్షిణం 60-0 అడుగులు గల జాగాలో నిర్మించిన ఆస్తి రూపు ఆర్.సి.సి రూఫ్ గృహము పూర ఈ ఆస్తి కదిరి గ్రామము పొలము సర్వే నెం:853-6లో కలదు
యస్.శివశంకర రెడ్డి,
వాదిపరం వకీలు, కదిరి. సెల్:9440949174

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్పర్సన్ కాచర్ల లక్ష్మి

పార్టీ జెండాను ఎగురవేస్తున్న మున్సిపల్ ఛైర్పర్సన్, వైస్ ఛైర్మన్.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ వేముల జయరామిరెడ్డి

అభివృద్ధి పనుల బ్యానర్ ను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్పర్సన్, వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లు

'వై ఎపి నీడ్స్ జగన్'ను జయప్రదం చేయండి

అభివృద్ధి పనుల బ్యానర్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, తదితరులు

కార్యక్రమంలో పాల్గొన్న ముదిగుబ్బ నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడాలంటే జగనే మరోసారి సిఎం కావాలని మున్సిపల్ ఛైర్పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ ఛైర్మన్ వేముల జయరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 1వ వార్డు గూడ్స్షెడ్ కొట్టాల సచివాలయం వద్ద గురువారం 'వై ఎపి నీడ్స్ జగన్'పై కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఛైర్పర్సన్, వైస్ ఛైర్మన్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నతో పాటు చాంద్‌బాషా, సచివాలయాల కన్వీనర్ మాసపల్లి సాయికుమార్, వైసిపి పట్టణ అధ్యక్షులు నీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, వార్డు ఇన్‌ఛార్జి చెలిమి పెద్దన్న హాజరయ్యారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. జగన్ పాలనలో పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అనంతరం వార్డులో చేసిన అభివృద్ధి పనుల బ్యానర్‌ను విడుదల చేశారు. వైసిపి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కేతా లోకేష్, చింతయల్లయ్య, కోఆప్షన్ సభ్యులు ఖరీమ్, బూశెట్టి రామకష్ణ, వైఎస్సార్సీపీ నాయకులు రాయపాటి రామకష్ణ, ఎస్పీ బాషా,సుబహాన్, తోపుదుర్తి వెంకట్రాముడు, అంగజాల ఈశ్వరయ్య, బైముతక రమణ, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గోరంట్ల : 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే శంకరనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని 1వ సచివాలయంలో గురువారం 'వై ఎపి నీడ్స్ జగన్'పై కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలనలో నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. కార్పొరేట్‌కు దీటుగా విద్య, ఇంటి వద్దకే వైద్యం అందుతుందన్నారు. పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. రైతులను ఆదుకున్నామన్నారు. ఆయా విషయాలను గృహసారథులు, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు క్లుప్తంగా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా, తహశీల్దార్ రంగనాయకులు, జడ్పిటిసి జయరాం నాయక్, సర్పంచి సరోజనాయక్, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ఉపసర్పంచి రాజారెడ్డి, టౌన్ కన్వీనర్ ధనారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల సచివాలయం 1వ వార్డులో నిర్వహించిన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మొదట సచివాలయంలో ఏర్పాటుచేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ నజిమున్నీసా, కమిషనర్ శ్రీహరిబాబు, రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్లు, ఆవులస్వామి, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్ర సమగ్రాభివృద్ధి సిఎం జగన్‌తోనే సాధ్యమవుతుందని మున్సిపల్ ఛైర్పర్సన్ ఇంద్రజ, జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ మారుతిరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ కాలనీ సచివాలయంలో 'వై ఎపి నీడ్స్ జగన్'పై కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయ ఆవరణలో అబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దీపికకు తోడుగా ఉండి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, సాధిక్, శివశంకర్‌రెడ్డి, నౌషాద్, కౌన్సిలర్లు షేక్‌రిహానా, లక్ష్మీమహేష్‌గౌడ్, షాజియ, జయప్ప, మణి, నాగరాజు, రహమత్‌బి, షేక్ రెహానాబాను, నాగేంద్రబాబు, రోషన్‌అలి, పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక 1వ సచివాలయంలో 'వై ఎపి నీడ్స్ జగన్'పై కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఇంటిపై జగనన్న నువ్వే మా నమ్మకం జెండాలను కట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయలక్ష్మి, కన్వీనర్ సివి నారాయణరెడ్డి, ఎంపిపి ఆదినారాయణయాదవ్, జడ్పిటిసి తిరుమలసేవేనాయక్, నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, సర్పంచి లక్ష్మిదేవిచెంద్రాయుడు, మల్లగుండ్ల భాస్కర్ పాల్గొన్నారు.

బత్తలపల్లి : సంక్షేమ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందాలంటే మళ్లీ జగనే సిఎం కావాలని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని ఎంపిపి బగ్గిరి త్రివేణి, జడ్పిటిసి కోటి సుధ, వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి గృహసారథులు, వాలంటీర్లకు సూచించారు. 'వై ఎపి నీడ్స్ జగన్'పై బత్తలపల్లి-1 సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ముందుగా ఎవరెవరు ఎంత లబ్ధి పొందారన్న వివరాలతో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాయిమనోహర్, కార్యదర్శి నారాయణస్వామి. వైస్ ఎంపిపిలు సారే పార్వతి, గజ్జెల వెంగళరెడ్డి, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, సింగిల్‌విండో డైరెక్టర్ కాళప్ప, రాంభూపాల్‌రెడ్డి, బగ్గిరి బయపరెడ్డి, కమతం ఈశ్వరయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : 'ఎపికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంపై గురువారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కాగా పంచాయతీ పరిధిలో 104 మంది వాలంటీర్లు ఉండగా 15 నుంచి 20 మంది మాత్రమే హాజరవడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమానికి ప్రతి వాలంటీర్ ఖచ్చితంగా హాజరు కావాలని, లేనిచో చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, ఇఒఆర్‌డి నాగరాజు రావు, వైస్ ఎంపిపి వెంకటనారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నోలంబుల రణస్థలం చోళెమర్రి

రాయిపై చెక్కిన బొమ్మలను చూపుతున్న మైనాస్వామి

ప్రజాశక్తి-పెనుకొండ

మడకశిర సమీపంలోని హెంజేరు(హేమావతి) రాజధానిగా పాలించిన నోలంబ పల్లవులు, చిక్కబళ్లా పురం వద్ద ఉన్న నంది కేంద్రంగా పాలన సాగించిన బాణరాజుల మధ్య జరిగిన ఘోర యుద్ధ ప్రదేశాన్ని పెను కొండ సమీపంలోని చోళెమర్రిగా గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. ఆయన గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నోలంబ పల్లవుల రాజ్యం, శిల్పకళాచాతుర్యం, సంస్కృతి తదితర అంశాలపై చేస్తున్న పరిశోధనలో భాగంగా చోళెమర్రి రొద్దం ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. నోలంబవాడి-32000 రాజ్యాన్ని మహేంద్ర నోలంబాది రాజ(సా.శ. 875-897) పాలిస్తున్న కాలంలో నోలంబపల్లవులు, బాణులకు మధ్య జరిగిన యుద్ధంలో మహేంద్రరాజ విజయం సాధించాడన్నారు. దీంతో బాణరాజులు, వైదంబులు కలిసి నోలంబ రాజ్యంపై దండెత్తగా నోలంబ మహేంద్రకు

చరిత్రకారుడు మైనాస్వామి

పశ్చిమ గంగరాజులు బాసటగా నిలిచారన్నారు. నేటి చోళెమర్రి గ్రామాన్ని నాడు సోరెమడిగా పిలిచేవారన్నారు. సోరెమడి యుద్ధానికి సంబంధించి పుంగనూరు దగ్గర గల చెదల్ల గ్రామంలో బాణులు ఒక వీరగల్లును ప్రతిష్ఠించి అందులో యుద్ధం గురించి వివరించారన్నారు. బాణరాజ ప్రతినిధి మాధవరాజు, వేలాది మంది సైనికులు, గుర్రాలు ఆ యుద్ధంలో మరణించినట్టు చెదల్ల శాసనం ద్వారా తెలుస్తుందన్నారు. మదనపల్లి సమీపంలోని బసినికొండ వద్ద ఉన్న వైదుంబ రాజు-గండ త్రినేత్ర రాయించిన శాసనంలో సోరెమడి యుద్ధంలో తమ సామంతుడు మారువాక చనిపోయినట్టు పేర్కొన్నారని తెలిపారు. రాయచోటి దగ్గరలోని అరవీడులో ఉన్న వైదుంబ శాసనం సోరెమడి యుద్ధం గురించి తెలుపుతుందన్నారు. కంబదూరు శాసనాన్ని బట్టి 'సోరెమడి యుద్ధం' సా.శ. 883లో జరిగి ఉండవచ్చని తెలిపారు.

అనుమానాలను నివృత్తి చేయండి

ప్రజాశక్తి-బత్తలపల్లి

కనకదాసు కళ్యాణ మండపం లావాదేవీలను బహిరంగ పరచి అందరి అనుమానాలను నివృత్తి చేయాలని ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు కోరారు. గుడికట్టు సంబరాలకు ఆహ్వానించేందుకు గురువారం అనంతపురం జిల్లా కురుబ సంఘం మాజీ అధ్యక్షులు రాజహంస శ్రీనివాసులు బత్తలపల్లిలోని కోటి ఇంటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మండలంలోని కురుబ సంఘం నాయకులు అక్కడికి చేరుకుని అనంతపురం నగరంలోని కనకదాసు కళ్యాణమండపం లావాదేవీలను బహిరంగ పరచాలని, గుడికట్టు సంబరాల విషయంలో నియంతృత్వ వైఖరిపై నిలదీశారు. దీంతో కోటి జోక్యం చేసుకుని కళ్యాణ మండపం వివరాలను పత్రికా ముఖంగా వ్యక్తం చేయాలని సూచించారు.

సామూహిక వివాహాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు : సామూహిక ఉచిత వివాహాలకు అర్హులైన యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని ప్రముఖ బిల్డర్ సాయికృష్ణ సూచించారు. సత్యసాయి బాబా 98వ జయంతి వేడుకలు పురస్కరించుకొని మండల పరిధిలోని చెన్నకేశవపురంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో డిసెంబర్ 17వ తేదీ ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువకులకు 21, యువతులకు 18 సంవత్సరాలు పూర్తయి ఉండాలన్నారు.

ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే విరాళం

కదిరి అర్బన్ : మండల పరిధిలోని కె.కుంట్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మారెమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులకు రూ. 10వేలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట వైసిపి నాయకులు ఉన్నారు.